# అందె శకుంతల దేవి గారి జ్ఞాపకార్థం కాశీంపూర్ లో కమ్యూనిటీ హాల్

## అందె ప్రతాప్ రెడ్డి సేవా స్పూర్తికి గ్రామస్తుల ప్రశంసలు



మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి నిజాంపేట మండలం కాశీంపూర్ గ్రామం తన జీవిత సహచరి అయినా అందె శకుంతల దేవి జ్ఞాపకాన్ని చిరస్థాయిగా నిలబెట్టేందుకు ప్రముఖ దాత, సామాజిక సేవకుడు అందె ప్రతాప్ రెడ్డి తన స్వగ్రామమైన కాశీంపూర్‌లో రూ.37 లక్షల వ్యయంతో విశాలమైన కమ్యూనిటీ భవనాన్ని నిర్మించి గ్రామ ప్రజలకు అంకితం చేశారు. వ్యక్తిగత అనుబంధాన్ని సామాజిక సేవతో మేళవించిన ఈ కార్యక్రమం గ్రామంలో ప్రత్యేక చర్చనీయాంశంగా మారింది. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలనే లక్ష్యంతో నిర్మించిన ఈ భవనం శుభకార్యాలు, గ్రామ సభలు, యువజన కార్యక్రమాలు, సాంస్కృతిక వేడుకలు, విద్యా సంబంధిత సమావేశాలకు ఉపయోగపడనుంది. దీంతో గ్రామ ప్రజలు ఇకపై వివిధ కార్యక్రమాల కోసం ఇతర ప్రాంతాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గనుంది. సమాజానికి తిరిగి ఇవ్వాలనే తపనతో అందె ప్రతాప్ రెడ్డి చేపట్టిన ఈ సేవా కార్యక్రమం ఆయన కుటుంబ విలువలను, గ్రామంపై ఉన్న ప్రేమను ప్రతిబింబిస్తోంది. భార్య అందె శకుంతల దేవి జ్ఞాపకార్థం నిర్మించిన ఈ భవనం కేవలం ఒక కట్టడం మాత్రమే కాదు, వారి కుటుంబం గ్రామంతో ఉన్న అనుబంధానికి ప్రతీకగా నిలిచింది.

ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు అందె ప్రతాప్ రెడ్డి సేవాభావాన్ని కొనియాడారు. గ్రామ అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని కోరుతూ, ఆయన చేసిన ఈ మంచి పని భావితరాలకు స్పూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక అవసరాల కోసం ఇలాంటి మౌలిక సదుపాయాల కొరత ఉన్న నేపథ్యంలో, స్వంత నిధులతో కమ్యూనిటీ భవనాన్ని నిర్మించడం గొప్ప విషయమని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. సమాజ హితం కోసం వ్యక్తిగత స్థాయిలో ముందుకు వచ్చి సేవ చేయాలనే ఆలోచనకు అందె ప్రతాప్ రెడ్డి నిలువెత్తు ఉదాహరణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కనకరాజు ఉపసర్పంచ్ రమేష్ మరియు వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు కల్వకుంట గ్రామ సర్పంచ్ అందె కొండల్ రెడ్డి మరియు బాలాజీ అమైన్స్ ప్రతినిధి నరేందర్ రెడ్డి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణమ్మకు వరద కళ.. జూరాల వైపు జలధారలు!



గద్వాల జూన్ 07 (వుదయం బ్యూరో): నైరుతి రుతుపవనాలు జోరందుకోవడంతో కృష్ణా నది పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఈ సీజన్‌లో తొలిసారిగా కృష్ణమ్మకు వరద కళ సంతరించుకుంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న జలప్రవాహాలతో తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్ వద్ద వరద నీటి రాక ప్రారంభమైంది. అధికారుల సమాచారం మేరకు ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు 4,750 క్యూసెక్కుల వరద జలాలు చేరుతున్నాయి. కర్ణాటక, మహారాష్ట్రలోని కృష్ణా పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో రానున్న రోజుల్లో ప్రవాహం మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో నీటిపారుదల శాఖ అధికారులు పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ప్రవేశం ఆలస్య మైనప్పటికీ, ఒకసారి చురుగ్గా మారిన తర్వాత విస్తారంగా వర్షాలు కురుస్తుం డటంతో నదులు, వాగులు, వంకలు జీవం పోసుకుంటున్నాయి. కృష్ణా నదిలో వరద జలాల రాక ప్రారంభం కావడం రైతాంగానికి శుభసూచకంగా మారింది.

# తెలంగాణ ఉద్యమకారులకు ఘన సన్మానం




సంగారెడ్డి జూన్ 07 (వుదయం బ్యూరో): సంగారెడ్డి పట్టణంలో తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణ సాధన కోసం ఉద్యమకారులు అనేక త్యాగాలు, పోరాటాలు చేశారని అన్నారు. వారి కృషి, త్యాగాల ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు.తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు తగిన గుర్తింపు, గౌరవం లభించాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులను విస్మరించిందని విమర్శించారు.

తెలంగాణ కోసం పోరాడిన వారిని గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రగతి చాటిన బస్సు యాత్ర.. గద్వాలలో ఘన ముగింపు"

## అలంపూర్ నుంచి గద్వాల వరకు సంక్షేమ పథకాల ప్రచారం
## ప్రజా పాలన--ప్రగతి నివేదిక యాత్ర విజయవంతమైందన్న కాంగ్రెస్ నేతలు



గద్వాల జూన్ 02 (వుదయం బ్యూరో): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో చేపట్టిన 'ప్రజా పాలన--ప్రగతి నివేదిక' బస్సు యాత్ర జోగులాంబ గద్వాల జిల్లాలో శనివారం ముగిసింది. జిల్లా కేంద్రంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రభుత్వ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించారు. తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్‌పర్సన్, గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సరిత తిరుపతయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వల్ల వివిధ వర్గాల ప్రజలు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. జిల్లాలో నిర్వహించిన బస్సు యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. తెలంగాణ రాష్ట్ర వాల్మీకి సంఘం చైర్మన్ ఘట్టు తిమ్మప్ప మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ యాత్ర జిల్లాలోని అన్ని ప్రాంతాలను చేరుకుని ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించిందన్నారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజల సహకారంతో కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు. పీసీసీ జిల్లా అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ జోగులాంబ అమ్మవారి ఆశీస్సులతో అలంపూర్‌లో ప్రారంభమైన బస్సు యాత్ర గద్వాలలో ముగియడం సంతోషకరమన్నారు. జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో పనిచేయడం వల్ల యాత్ర విజయవం తమైందని పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే కార్యక్రమానికి హాజరు కాకపోవడంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, ఆయన ఇతర కార్యక్రమాల్లో నిమగ్నమై ఉండటంతో హాజరు కాలేకపోయారని నాయకులు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రజా పాలన--ప్రగతి నివేదిక బస్సు యాత్ర జిల్లా ఇన్‌చార్జి విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ బ్లాక్ కమిటీ అధ్యక్షుడు నల్లారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జహీరాబాద్ లో భృంగి ఇంటర్నేషనల్ స్కూల్, ప్రారంభోత్సవశీ



కోహీర్ జూన్ 7(వుదయం ప్రతినిధి) జహీరాబాద్ పట్టణం పస్తాపర్ మున్సిపల్ ఇ- రోడ్ జహీరాబాద్ సమయంమధ్యాహ్నం 1:30 గంటలకు,బృంగి ఇంటర్నేషనల్ స్కూల్ ఘనంగా ప్రరంభోత్సవం కానుంది

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఆధునిక సౌకర్యాలతో ప్రారంభమవుతున్న భృంగి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజలందరూ విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా ఆ సంస్థ యాజమాన్యం తెల్పింది జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ మండలం పైడిగుమ్మల్ మాజీ ఎంపిటిసి బి జ్ఞాన రత్నం మండల ప్రజలను స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించారు మీ రాక మాకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది వారు తెలియజేసారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు సురేష్ కుమార్ శెట్కార్ జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు ఏ.ప్రమీల - చంద్రశేఖర్ భృంగి విద్యాసంస్థల కరెస్పాండంట్ సెక్రటరీ భృంగి ఇంటర్నేషనల్ విద్యాసంస్థల చైర్మెన్ డా॥ఏ.చంద్రశేఖర్ తదితరులు పాల్గొననున్నారు

# విశ్వకర్మల అభివృద్ధికి పాటుపడుదాం



అయిజ జూన్ 07 (వుదయం ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా అడక్ కమిటి సభ్యులు సిద్ధార్థ, నర్సింహాచారి ఆధ్వర్యంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర శివరామ దేవాలయం, అయిజ నందు విశ్వకర్మల అభివృద్ధి కోసం పట్టణానికి సంబందించిన కన్వీనర్లు, కోకన్వినర్లు కలిసి ఆదివారం అయిజ పట్టణానికి నూతన విశ్వకర్మ సంఘాన్ని ఎన్నుకోవడం జరిగింది.పట్టణ అధ్యక్షునిగా పర్దిపురం వీరయ్య, ప్రధాన కార్యదర్శిగా శేఖర్, కోశాధిగారిగా మాదవాచారి, గౌరవ అధ్యక్షులుగా చిన్న శంకరయ్య, గౌరవ సలహాదారుగా రామలింగయ్య, ఉపాధ్యక్షులుగా ప్రభాకరాచారి, సంయుక్త కార్యదర్శిగా తిరుమలేష్, కార్యవర్గ సభ్యులుగా బ్రహ్మయ్య, లక్ష్మన్న ఆచారి, తాటికుంట వీరేష్, రాజు, రాఘవేంద్ర, రామకృష్ణ, పర్దేపురం మధులను ఎన్నుకోవడం జరిగింది. విశ్వకర్మల అభివృద్ధి కోసం అందరం కలిసికట్టుగా పాటుపడదామని, విశ్వకర్మ ల హక్కులకోసం సంఘటితం కావాలసిన సమయం ఆసన్నమైందని నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కౌన్సిలర్ షేక్షావళి ఆచారి, విశ్వకర్మ కుటుంబ సభ్యులు కంసలి శీను, కాశీపథి, భీమేష్, వెంకటేష్, పవన్, నర్సింహా, వీరన్న, రాఘవేంద్ర, నాగరాజు, కృష్ణ, వీరయ్య, సర్వేష్, నాగేంద్ర, టీచర్ సత్యనారాయణ, హరి, ఆనంద్ మొదలగు వారు హాజరై నూతన కమిటిని సన్మానించడం జరిగింది.

# తొలి రోజే విద్యార్థుల చేతిలో పుస్తకాలు

## ♦ నాగర్‌కర్నూల్ జిల్లాలో పంపిణీకి సర్వం సిద్ధం



నాగర్‌కర్నూల్, జూన్ 07 (వుదయం బ్యూరో): పాఠశాలలు తెరుచుకున్న తొలి రోజే విద్యార్థుల చేతికి పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్ అందించేందుకు నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది.జిల్లాలోని 772 ప్రభుత్వ విద్యాసంస్థలకు పుస్తకాలు, నోటుబుక్స్ సరఫరా పూర్తయినట్లు జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ వెల్లడించారు. జిల్లాలో మొత్తం 54,666 మంది విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీకి సిద్ధంగా ఉంది.జిల్లాలో 495 ప్రాథమిక, 125 అప్పర్ ప్రైమరీ, 130 హైస్కూల్లు, 22 జూనియర్ కళాశాలలు కొనసాగుతున్నాయి. కేజీబీవీలు, గురుకులాలు, మైనార్టీ గురుకులాలు, జ్యోతిరావు పూలే విద్యాసంస్థలకు కూడా సరఫరా పూర్తయింది.విద్యార్థులకు అవసరమైన 3,86,070 పాఠ్యపుస్తకాలు, 3,91,855 నోటుబుక్స్ పంపిణీకి సిద్ధం చేశారు. మండల విద్యాశాఖ కార్యాలయాల ద్వారా నోటుబుక్స్, నేరుగా పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ చేపట్టారు. 5వ తరగతి తెలుగు, 9వ తరగతి హిందీ పుస్తకాలు మాత్రమే ఇంకా అందాల్సి ఉన్నట్లు డీఈఓ తెలిపారు. అదనంగా 84 వేల వర్క్‌బుక్స్ పంపిణీకి చర్యలు కొనసాగుతున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పంపిణీ ప్రక్రియ పూర్తి చేయడం ప్రభుత్వ ప్రత్యేక చర్యగా అధికారులు పేర్కొన్నారు. గతంలోలాగా ఆలస్యం కాకుండా ప్రతి విద్యార్థికి తొలి రోజే పుస్తకాలు అందేలా చర్యలు తీసుకున్నామని డీఈఓ రమేష్ కుమార్ స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు, వసతి, పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్ వంటి సౌకర్యాలతో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అధికారులు తెలిపారు.

# ఎస్ ఎస్ కే సమాజ్ సభకు తరలిన పేట సమాజ్ సభ్యులు



నారాయణపేట టౌన్ జూన్07(వుదయం ప్రతినిధి): హైదరాబాద్ లో ఎస్ ఎస్ కే సమాజ్ తెలంగాణ రాష్ట్ర భవనం,ఉత్తమ విద్యార్థుల సన్మాన సభకు నారాయణపేట జిల్లా,పట్టణం నుంచి ఎస్ ఎస్ కే సమాజ్ సభ్యులు భారీ ఎత్తున తరలి వెళ్లారు. ఈ సభలో నారాయణపేట పట్టణానికి చెందిన 15 మంది ఉత్తమ విద్యార్థులను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్,ఎంపి. ఈటెల రాజేందర్ ,ఎమ్మెల్యేలు,ఎస్ ఎస్ కే సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు విశ్వనాథ్ రవీంద్ర,ఉపాధ్యక్షుడు నాగురావు నామాజీ,ప్రధాన కార్యదర్శి టాంక్ విష్ణు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పేదల సంక్షేమం కోసం సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట నుంచి ఎస్ ఎస్ కే సమాజ్ సభ్యులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.

# విద్యార్థిని మృతి ఘటనపై కలెక్టర్ సీరియస్


## ఆరుగురు సభ్యులతో స్వతంత్ర విచారణ కమిటీ ఏర్పాటు
## వైద్యుల నిర్లక్ష్య ఆరోపణలపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశం



గద్వాల జూన్ 07 (వుదయం బ్యూరో): గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్రచికిత్సకు ముందు విద్యార్థిని మృతి చెందిన ఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సీరియస్‌గా స్పందించారు. ఘటనకు సంబంధించిన వాస్తవాలను వెలికితీసేందుకు ఆరుగురు సభ్యులతో కూడిన స్వతంత్ర విచారణ కమిటీని నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎర్రవల్లి మండల కేంద్రానికి చెందిన ఇందు (17) కడుపునొప్పితో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు శుక్రవారం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు ఆమెకు అపెండిసైటిస్ ఉన్నట్లు నిర్ధారించి శనివారం శస్త్రచికిత్సకు సిద్ధం చేశారు. అయితే ఆపరేషన్‌కు తీసుకెళ్లిన అనంతరం విద్యార్థిని మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యమే తమ కుమార్తె ప్రాణాలు బలిగొన్నదని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని స్పందించిన జిల్లా కలెక్టర్, స్వతంత్ర విచారణకు ఆదేశాలు జారీ చేశారు. మృతురాలి కేసు షీట్, చికిత్స రికార్డులు, వైద్యుల నోట్స్, ల్యాబ్ నివేదికలు తదితర పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. విచారణలో ఆసుపత్రి పర్యవేక్షకులు, సంబంధిత వైద్యాధికారులు పూర్తి సహకారం అందించాలని స్పష్టం చేసిన కలెక్టర్, కమిటీ విధులకు ఆటంకం కలిగించినా లేదా సహకరించకపోయినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కమిటీ నివేదిక ఆధారంగా బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు ఘటనకు దారితీసిన పరిస్థితులపై పూర్తి స్థాయిలో బాధ్యత నిర్ధారణ చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

# నేడు కుమ్మెర సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

## కొన్ని గ్రామాలకు విద్యుత్ అంతరాయం



నాగర్‌కర్నూల్, జూన్ 08 (వుదయం బ్యూరో) 33/11 కెవి కుమ్మెర సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ మాన్యా నాయక్ ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు 33/11 కెవి కుమ్మెర సబ్‌స్టేషన్‌కు సంబంధించిన 11 కెవి ఫీడర్లు ఆఫ్‌లో ఉంటాయి. దీంతో కుమ్మెర, లక్ష్మితండా, తుమ్ములసుగూరు, ఏత్మతాపూర్, పర్వతైపల్లి, పర్వతైపల్లి తండా, వసంతపూర్, లింగసానిపల్లి, కారుకొండ గ్రామాలకు, అలాగే గజ కంపెనీ, మెగా కంపెనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ప్రజలు గమనించి సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు.

# నాగర్ కర్నూల్ పై నారాయణపేట జట్టు గెలుపు



నారాయణపేట టౌన్ జూన్07(వుదయం ప్రతినిధి): సమ్మర్ క్రికెట్ క్యాంపు లో భాగంగా ఆదివారం నారాయణపేట బాలాజీ ఐ టి ఐ కాలేజీ మైదానంలో ఎం డి సి ఎ ఆధ్వర్యంలో అండర్ 16 నాగర్ కర్నూల్ నారాయణపేట జట్ల మధ్య జరిగిన క్రికెట్ పోటీలో నారాయణపేట జట్టు విజయం సాధించిందనీ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ఇంఛార్జి రమణ తెలిపారు. అలాగే అండర్ 14 పోటీలోను నాగర్ కర్నూల్ పై నారాయణపేట జట్టు విజయం సాధించిందని తెలిపారు. ఈ మ్యాచ్ పరిశీలకులు మాట్లాడుతూ క్రికెటర్లు వైభవ్ సూర్యను స్పూర్తిగా తీసుకుని రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ సమ్మర్ క్యాంప్ ఇంఛార్జి సుధాకర్ కోచ్ లు అజయ్,కార్తీక్,సురేష్,జహీర్,అర్చన తదితరులు పాల్గొన్నారు.

# నా విజయానికి గురువే కారణం -రాము రాథోడ్

## సాయి లహరి వేసవి సాంస్కృతిక శిక్షణ ముగింపు వేడుకలో గురుభక్తి చాటుకున్న బిగ్‌బాస్ ఫేమ్





నాగర్‌కర్నూల్, జూన్ 07 (వుదయం బ్యూరో): జిల్లా కేంద్రంలోని సాయి గార్డెన్స్‌లో శనివారం రాత్రి సాయి లహరి ఆర్ట్స్ అకాడమీ వేసవి సాంస్కృతిక శిక్షణ తరగతుల ముగింపు వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిగ్‌బాస్ ఫేమ్ రాము రాథోడ్ హాజరై మాట్లాడుతూ, "నా జీవితంలో సాధించిన ప్రతి విజయానికి కారణం నా గురువు పోలోజి సత్యం గారి కృషి, మార్గదర్శకం. గురువు లేనిదే కళ లేదు, గురువు చూపిన దారే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చింది" అన్నారు. వేదికపై గురువును ఘనంగా సన్మానించి పాదాభివందనం చేసి గురుభక్తిని చాటుకున్నారు. కళా నైపుణ్యాలు పెంపొందించడానికి ఇలాంటి శిబిరాలు అవసరమని, తల్లిదండ్రులు తమ పిల్లలను కళలవైపు ప్రోత్సహించాలని రాము రాథోడ్ సూచించారు. కూచిపూడి, భరతనాట్యం, డాన్స్‌లో శిక్షణ పొందిన విద్యార్థుల ప్రతిభా ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కళాకారులు, డాన్స్ మాస్టర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## వేసవి సమస్యల నుంచి ఉపశమనమిలా..!




వేసవిలో విపరీతమైన చెమట, డీహైడ్రేషన్, చర్మం పదే పదే జిడ్డుగా మారడం, చెమటకాయలు.. ఎక్కువగా బాధిస్తుంటాయి. వీటికి తోడు ట్యాన్, సన్‌బర్న్.. వంటి సమస్యలూ అందాన్ని దెబ్బతీస్తాయి. ముఖ్యంగా ముఖం, మెడ, వీపు, చేతులపై.. వీటి తాలూకు మచ్చలు స్పష్టంగా కనిపిస్తాయి. ఈ క్రమంలో ఈ సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు కొన్ని ఇంటి చిట్కాలు దోహదం చేస్తాయంటున్నారు నిపుణులు. స్నానం చేసే నీటిలో ఓట్స్ కలుపుకోవడం ద్వారా వేసవిలో ఎదురయ్యే చర్మ సంబంధిత సమస్యల నుంచి చాలావరకు ఉపశమనం లభిస్తుంది అంటున్నారు నిపుణులు. ఓట్స్ చర్మంపై మూసుకుపోయిన స్వేదగ్రంధులు తెరచుకునేలా చేస్తాయి. తద్వారా చెమటకాయలు తగ్గడంతో పాటు వాటివల్ల కలిగే దురద, మంట.. వంటివి కూడా తగ్గుముఖం పడతాయి. కాబట్టి స్నానం చేయడానికి ఉపయోగించే బకెట్ గోరువెచ్చని నీటిలో కొన్ని ఓట్స్ వేసి కాసేపు నాననివ్వాలి. బాత్‌టబ్‌లో స్నానం చేసేటప్పుడు ఈ చిట్కాను పాటిస్తే మరింత మెరుగైన ఫలితం పొందచ్చు అని చెబుతున్నారు.


చెమటకాయలు, వాటి వల్ల వచ్చే దురద, మంట.. వీటి నుంచి విముక్తి పొందడానికి ఇంట్లో లభ్యమయ్యే ఐస్‌క్యూబ్స్‌ని ఉపయోగిస్తే చాలు.. కాటన్ లేదా మెత్తని వస్త్రంలో కొన్ని ఐస్‌క్యూబ్స్ వేయాలి. దానిని మూటలా కట్టి దాంతో సమస్య ఉన్న ప్రదేశంలో మృదువుగా అద్దుకోవాలి. తరచూ ఇలా చేస్తే ఉపశమనం లభిస్తుందంటున్నారు. సూర్యరశ్మిలోని అతినీలలోహిత కిరణాల కారణంగా సన్‌బర్న్, ట్యాన్.. వంటి సమస్యలు తలెత్తడం సహజం. వాటి నుంచి విముక్తి పొందేందుకు ముల్తానీ మట్టి చక్కగా ఉపయోగపడుతుంది అంటున్నారు నిపుణులు. దీనికోసం రెండు చెంచాల ముల్తానీమట్టిలో సరిపడా రోజ్‌వాటర్ వేసి బాగా మిక్స్ చేయాలి. సమస్య ఉన్న ప్రదేశంలో ఈ మిశ్రమాన్ని అప్లై చేసి పూర్తిగా ఆరేంత వరకు అలాగే ఉంచుకోవాలి. ఆ తర్వాత చల్లని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల మంచి ఫలితాన్ని పొందచ్చు. ముల్తానీమట్టికి బదులుగా చందనం లేదా గంధం కూడా ఉపయోగించవచ్చుట. కీరాదోసని ముక్కలుగా కోసి సమస్య ఉన్న ప్రాంతంలో వాటితో రుద్దడం.. లేదా కీరాదోసను మెత్తని గుజ్జులా చేసి సన్‌బర్న్, ట్యాన్, చెమటకాయలు.. మొదలైనవి ఉన్న ప్రాంతంలో పూతలా అప్లై చేయాలి. ఆ తర్వాత 15 నుంచి 20 నిమిషాలు ఆరనిచ్చి శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తే సమస్యలు తొలగిపోవడంతో పాటు చర్మానికి చల్లదనం కూడా అందుతుంది అని చెబుతున్నారు నిపుణులు.

## బరువు మందులతో స్తంభన లోపం!




ఇటీవల గ్లూకగాన్ లైక్ పెప్టైడ్-1 (జీఎల్‌పీ-1) రిసెప్టర్ ఎగొనిస్ట్ రకం మందులు చాలా ప్రాచుర్యం పొందాయి. టైప్ 2 మధుమేహ చికిత్స కోసం రూపొందించిన ఇవి బరువునూ తగ్గిస్తున్నాయి. అయితే మగవారి ఆరోగ్యం మీద ఈ మందులు చూపే ప్రభావాలపై కొత్త సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మధుమేహం గలవారిలో వీటితో స్తంభన లోపం ముప్పు పెరగొచ్చని ఇక్లినికల్ మెడిసిన్‌లో ప్రచురితమైన తాజా అధ్యయనం పేర్కొంటోంది. మధుమేహం గల 10వేల మంది మగవారి ఆరోగ్య వివరాలను ఇందులో విశ్లేషించారు. వీరంతా కొత్తగా జీఎల్‌పీ-1 రిసెప్టర్ ఎగొనిస్ట్ లేదా డీపీపీ-4 ఇన్‌హిబిటార్స్ అనే మరోరకం మధుమేహం మందులను ఆరంభించినవారే. మూడేళ్ల తర్వాత పరిశీలించగా డీపీపీ-4 ఇన్‌హిబిటార్స్ వేసుకునేవారితో పోలిస్తే జీఎల్‌పీ-1 మందులు వేసుకునేవారికి స్తంభన లోపం ముప్పు 26% ఎక్కువగా ఉంటున్నట్టు తేలింది. డీపీపీ-4 ఇన్‌హిబిటార్స్ వాడినవారిలో సుమారు 2.8% మందిలో స్తంభన లోపం తలెత్తగా జీఎల్‌పీ-1 వేసుకున్నవారిలో 3.5% మంది దీని బారినపడ్డారు. అయితే ఈ మందులకూ సమస్యకూ నేరుగా కార్యకారణ సంబంధం ఉంటున్నట్టు అధ్యయన ఫలితాలు కచ్చితంగా చెప్పలేదు గానీ సంబంధముండే అవకాశముందని, ఇందులో ఇతరత్రా అంశాలూ ప్రభావితం చూపుతుండొచ్చని సూచిస్తున్నాయి. ప్రస్తుతం జీఎల్‌పీ-1 మందుల వాడకం రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో వీటితో తలెత్తే దుష్ప్రభావాలు, ముఖ్యంగా రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేసే వాటి గురించి అర్థం చేసుకోటం అత్యవసరంగా మారింది. నిజానికి మధుమేహ దుష్ప్రభావాల్లో స్తంభన లోపం కూడా ఒకటి. మధుమేహం గల మగవారిలో సుమారు సగం మంది జీవితంలో ఎప్పుడో అప్పుడు దీంతో ఇబ్బంది పడుతుంటారు. దీర్ఘకాలంగా రక్తంలో గ్లూకోజు మోతాదులు ఎక్కువగా ఉంటూ వస్తుండటం వల్ల రక్తనాళాలు (అంగానికి రక్త సరఫరా చేసే నాళాలు), నాడులు (స్పర్శ, స్పందన తగ్గటం) దెబ్బతింటాయి. హార్మోన్ల మోతాదుల్లోనూ మార్పులు సంభవిస్తుంటాయి. ఇవన్నీ స్తంభన లోపానికి దారితీస్తుంటాయి. ఇప్పుడు మందుల దుష్ప్రభావాలూ తోడవుతుండటం ఆలోచించదగ్గ విషయం.

## కాలేయ క్యాన్సర్ వృద్ధికి ప్రొటీన్ ఊతం



కాలేయ క్యాన్సర్ గలవారు ఆహారంలో ప్రొటీన్ తగ్గించుకుంటే కణితి వృద్ధి నెమ్మదిస్తున్నట్టు రట్‌గర్స్ యూనివర్సిటీ అధ్యయనంలో బయటపడింది. సాధారణంగా మనం తీసుకునే ప్రొటీన్ విచ్ఛిన్నమైనప్పుడు పుట్టుకొచ్చే అమ్మోనియా అనే రసాయనాన్ని కాలేయం విడగొడుతుంది. ఇది యూరియాగా మారి మూత్రం ద్వారా బయటకు వచ్చేస్తుంది. అయితే కాలేయం దెబ్బతిన్నప్పుడు అమ్మోనియాను విడగొట్టే ప్రక్రియ సజావుగా సాగదు. దీంతో బయటకు వెళ్లకుండా కాలేయంలో, రక్తంలో పెద్దమొత్తంలో పోగవుతుంది. దీన్ని కణితి కణాలు అమ్మోనియా ఆమ్లాలు, న్యూక్లియోటైడ్లుగా మార్చుకుంటాయి. ఇవి డీఎన్ఏ, కణాల విభజనకు అత్యవసరం. వీటి సాయంతోనే కణితి కణాలు వేగంగా వృద్ధి చెందుతాయి. అంటే ఆహారంలో ప్రొటీన్‌ను తగ్గించుకోవటం ద్వారా కాలేయ క్యాన్సర్ త్వరగా ముదరకుండా చూసుకోవచ్చన్నమాట. అమ్మోనియా శరీరంలోంచి బయటకు వెళ్లటానికి తోడ్పడే ఎంజైమ్‌లను చెదరకొడితే కణితి మరింత తీవ్రమవుతున్నట్టు, జీవన కాలం తగ్గుతున్నట్టూ పరిశోధకులు గుర్తించారు. క్యాన్సర్ ముదరటంలో శరీరంలోంచి వ్యర్థాలను బయటకు పంపించే వ్యవ స్థ అస్తవ్యస్తం కావటం నేరుగా ప్రభావం చూపుతున్నట్టు ఇది తెలియజేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా కాలేయ క్యాన్సర్ పెరుగుతున్న నేపథ్యంలో తాజా అధ్య యన ఫలితాలు మరింత ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. ప్రతి నలుగురిలో ఒకరు కాలేయ కొవ్వు, హెపటైటిస్, మద్యంతో ముడిపడిన కాలేయ జబ్బులతో బాధపడుతున్నారని అంచనా. ఇవన్నీ అమ్మోనియా శుద్ధి ప్రక్రియను దెబ్బతీసేవే కావటం గమనార్హం.

## బొప్పాయితో మెరిసేలా..!




ఫేషియల్ అంటే చాలామందికి పార్లరే గుర్తొస్తుంది. కానీ ఆ అవసరం లేకుండా ఇంట్లో లభించే పదార్థాలు, పండ్లతోనే స్వయంగా ఫేషియల్ చేసుకొని అందంగా మెరిసిపోవచ్చంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో బొప్పాయితో చేసుకొనే ఈ ఫేషియల్ కూడా అలాంటిదే అంటున్నారు. బాగా పండిన బొప్పాయిపై తొక్క తీసేసి.. ముక్కలుగా కట్ చేయాలి. వీటిని మిక్సీలో వేసి పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ గుజ్జును ముఖానికి, మెడకు పట్టించి.. 5 నుంచి 10 నిమిషాల పాటు గుండ్రంగా రుద్దుతూ మర్దన చేసుకోవాలి. తర్వాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. కావాలనుకుంటే ఈ బొప్పాయి పేస్ట్‌కు టీస్పూన్ చొప్పున కలబంద గుజ్జు, తేనె కలుపుకోవచ్చు. ఇలా బొప్పాయితో చేసుకొనే ఫేషియల్ గోల్డెన్ ఫేషియల్ చేసుకున్నంత ఫలితాన్నిస్తుందంటున్నారు నిపుణులు. అంతేకాదు.. ముఖం మీద ఉండే ట్యాన్ కూడా తగ్గుముఖం పడుతుందట! ఇలా వారానికి ఒకటి లేదా రెండుసార్లు చేయడం వల్ల ప్రకాశవంతమైన చర్మం సొంతమవుతుందంటున్నారు.

## అదే వారి సౌందర్య రహస్యం..!

నల్లగా నిగనిగలాడే ఒత్తైన కురులు, పాల మీగడలాంటి మృదువైన చర్మం, కలువరేకుల్లాంటి సోగ కళ్లు.. వెరసి చూపు తిప్పుకోలేని అందం అరేబియన్ భామల సొంతం. మరి, సహజసిద్ధమైన పదార్థాల వినియోగమే వారి సౌందర్య రహస్యం అంటున్నారు నిపుణులు.. సలాడ్లలో, సాస్ డిప్‌గా అవకాడోను వాడటం మనకు అలవాటే! అయితే అరేబియన్లు సౌందర్య పరిరక్షణలోనూ దీనిని భాగం చేస్తారట. అవకాడో గుజ్జులో తేనె, నిమ్మరసం, కాస్త కొబ్బరినూనె కలిపి ప్యాక్‌లా వేసుకుంటే చర్మం మృదుత్వాన్ని సంతరించుకుంటుంది. అవకాడో నూనెతో మసాజ్ చేసుకున్నా ఫలితం ఉంటుంది అంటున్నారు నిపుణులు. అరేబియన్ల సౌందర్య పోషణలో ఆర్గన్ ఆయిల్‌ది చాలా ముఖ్యమైన స్థానం అంటున్నారు నిపుణులు. తల వెంట్రుకల నుంచీ కాలిగోళ్ల వరకూ ప్రతి సౌందర్య చికిత్సలో భాగంగా వారు దీన్ని వాడటానికి ఇష్టపడతారట. జుట్టు, చర్మం, గోళ్లు ఆరోగ్యంగా ఉండటానికి తరచూ ఆర్గన్ ఆయిల్‌తో మర్దన చేసుకుంటారట. చర్మం పొడిబారకుండా ఉండటానికి తేనె ఉపయోగపడుతుంది. తేనె చర్మాన్ని బిగుతుగా, కాంతివంతంగా మారుస్తుంది. అరేబియన్ భామలు కీరా దోస రసంలో తేనెను కలిపి ముఖానికి ప్యాక్‌లా వేసుకుంటారట! దీనివల్ల చర్మం కాంతులీనుతుందట. గుడ్డులోని తెల్ల సొన చర్మాన్ని బిగుతుగా మారుస్తుంది. అలాగే గుడ్డుతో హెయిర్ ప్యాక్ వేసుకోవడం వల్ల జుట్టు కుదుళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. అయితే అరేబియన్ మహిళలు తమ ఒత్తైన కురుల కోసం గుడ్డుతో పాటు కొబ్బరి నూనె, నువ్వుల నూనె కలిపి జుట్టు కి ప్యాక్‌లా వేసుకుంటారట. దీనివల్ల కుదుళ్లు దృఢంగా మారతాయట. టర్కీ భామల్లాగే అరేబియన్లూ తమ సౌందర్య పోషణకు కెఫిర్ అనే బ్యాక్టీరియాతో తయారు చేసిన పెరుగును ఉపయోగిస్తారట. ఈ క్రమంలో టర్కీ భామలు దీన్ని ఆహారంగా తీసుకుంటే.. అరేబియన్లు ఆహారంతో పాటు జుట్టుకి, చర్మానికి ప్యాక్‌లానూ దీన్ని వాడతారట. కెఫిర్‌కి ప్రత్యామ్నాయంగా మనకు అందుబాటులో ఉన్న పెరుగును పులియబెట్టి వాడుకోవచ్చు అంటున్నారు నిపుణులు. కలబంద గుజ్జులో పసుపు, ఆర్గన్ ఆయిల్ కలిపి చర్మానికి ప్యాక్‌లా వేసుకుంటే మొటిమలు, మచ్చలు తగ్గి, చర్మం నవయవ్వనంగా మెరిసిపోతుంది అంటున్నారు నిపుణులు. వయసు పెరిగినా వన్నె తరగని అరబిక్ భామల చర్మ సౌందర్య రహస్యం ఇదేనట!




## అవి వాడిపోకుండా..!




వేసవిలో కొన్ని రకాల పండ్లు, ఆకు కూరలు చాలా త్వరగా పాడైపోతుంటాయి. ఫ్రిజ్‌లో పెట్టినా వాటి తాజాదనం నిలవడం కష్టం. మరి ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి? చూద్దాం రండి.. ఎండాకాలంలో కొత్తిమీర, కరివేపాకు ఫ్రిజ్‌లో పెట్టినా మరుసటిరోజే వాడిపోతుంటాయి. ఇలా జరగకుండా ఉండాలంటే.. ఐస్ ట్రేలో సగం వరకు కరిగించిన బటర్/నెయ్యిని పోసి అందులో తరిగిన కొత్తిమీర/కరివేపాకు వేసి ఫ్రీజర్‌లో ఉంచాలి. రెండు రోజుల తర్వాత, ఆ క్యూబ్స్‌ని జిప్‌లాక్ కవర్లలోకి మార్చి రిఫ్రిజిరేటర్లో భద్రపరచాలి. కూరలు ఉడికేటప్పుడు ఈ క్యూబ్స్‌ని అందులో వేస్తే సరి! అలాగే ఆకు కూరలు ఎక్కువ రోజులపాటు తాజాగా ఉండాలంటే వాటిని కడిగి, ఆరబెట్టి, సన్నగా తరుక్కోవాలి. తర్వాత ఐస్ ట్రేలలో ముప్పావు వంతు నింపి, ఆకులు మునిగే వరకు నీరు పోసి ఫ్రీజర్‌లో ఉంచాలి. వీటికి ఇతర పదార్థాల వాసన పట్టకుండా ఉండాలంటే ఈ ఐస్‌ట్రేలకు ఫుడ్ గ్రేడ్ ప్లాస్టిక్ ఫిల్మ్ చుడితే సరిపోతుంది అంటున్నారు నిపుణులు.

## ఇవి సహజ ఏసీలు!



తెల్లారిన కొద్దిసేపటికే ఇంట్లో వేడి సెగ మొదలవుతోంది కదూ! అస్తమానం ఏసీలు వేసి ఉంచితే కరెంట్ బిల్లు షాక్ కొట్టేస్తుంది. ఎలాగైనా ఇబ్బందే! అందుకే ఈ సహజ ఏసీలను ఇంట్లో పెట్టేసుకోండి.

అరెకా పామ్... మడగాస్కర్ నుంచి వచ్చినా మన వేడి వాతావరణాన్నీ తట్టుకోగలదు. ఓ రెండు మూడు మొక్కలకు ఇంట్లో చోటివ్వండి. ఇది చల్లని నీటి ఆవిరిని గాల్లోకి వదులుతూ ఉంటుంది. దీంతో వేడి శాతం తగ్గుతుంది. పైగా ఈ మొక్క గాలినీ శుద్ధి చేయగలదు. అప్పుడప్పుడూ ఎండలో ఉంచాలి, మట్టిలో తేమ తగ్గినప్పుడు నీటిని అందిస్తే చాలు.

స్నేక్ ప్లాంట్... నీటి ఎద్దడిలోనూ బతికేయగలదని ఈ మొక్కకి పేరు. తరచూ నీటిని పోయడం మర్చిపోయినా తట్టుకోగలదు. ఇది రాత్రుళ్లు ఆక్సిజన్‌ని ఎక్కువ విడుదల చేస్తుంది. నిద్ర బాగా పట్టేలా చేయగలదు. గది వాతావరణాన్నీ చల్లబరుస్తుంది. అందుకే దీనికి పడకగదిలో చోటివ్వమని చెబుతారు.

కలబంద... ఆరోగ్యం, సౌందర్య పోషణకోసం దీన్ని ఉపయోగిస్తూనే ఉంటాం. అయితే ఇది ఎండ నుంచీ ఉపశమనం కలిగించగలదు. ఇది వాతావరణంలోకి నీటి ఆవిరిని విడుదల చేస్తుంది. తద్వారా దీన్ని ఉంచిన గదికి చల్లదనాన్ని ఇస్తుంది. కిటికీలు, వంటగదుల్లో వీటికి చోటిస్తే సరి.

పీస్ లిల్లీ... సాధారణంగా ఏడాదిలో ఒకట్రెండు సార్లు పూస్తుందంతే. ముఖ్యంగా పూలు మార్చి, ఏప్రిల్ నెలల్లోనే పూస్తాయి. దీనికీ 'నేచురల్ కూలింగ్ ప్లాంట్'గా పేరు. ఇది తేమను వదులుతూ గాలి పొడిబారడాన్ని తగ్గిస్తుంది. తద్వారా గదిని చల్లబరుస్తుంది. హాలు, బెడ్ రూమ్‌లకు ఇది చక్కని ఎంపిక.

మనీ ప్లాంట్... శుభం, అందంగా కనిపిస్తుందని దీన్ని ఎక్కువగా పెంచుతారు. కానీ దీనికి వేడిని గ్రహించే శక్తి ఎక్కువ. దీంతో చుట్టుపక్కల చల్లదనం పరుచుకుంటుంది. దీన్ని పెంచడానికి పెద్దగా శ్రమ కూడా అవసరం లేదు. ఇంకేం ఇంట్లో వీటికి చోటిచ్చేయండి. సహజ చల్లదనం మీ సొంతం.

